వర్షమాగదు.. బతుకు సాగదు

- తెరిపివ్వని వర్షం
- బడుగుజీవుల ఉపాధిపై ప్రభావం
- వ్యాపారాలు సాగక ఆర్థిక ఇబ్బందులు



ఊర్వశి కూడలిలో వ్యాపారం సాగక ఇంటి ముఖం పడుతున్న అరటిపళ్ల వ్యాపారి

కంచరపాలెం : రెక్కాడితే గానీ డొక్కాడని బడుగుజీవులు వరుణుడి ప్రతాపంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు పక్కన, ఫుట్‌పాత్‌పైన, బస్టాప్‌ల సమీపంలో చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుని... ఆ వచ్చే డబ్బులతో బతుకు బండిని లాగించే వేలాది మంది తెరిపివ్వని వర్షంతో ఉపాధి కోల్పోయారు. బంగాళాఖాతంలో మూడు రోజులుగా ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో శనివారం కంచరపాలెం, జ్ఞానాపురం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, మర్రిపాలెం ప్రాంతాల్లో చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇళ్లలో నుంచి బయటకు కాలు పెట్టలేని పరిస్థితి నెలకొనడంతో వినియోగదారులు ఎవరూ సరకుల కొనుగోలుకు రాలేదు. ఫలితంగా కూరగాయలు, పండ్లు, పువ్వులు తడిసిపోయాయి. సాయంత్రం వరకూ ఎదురుచూసినా కొనుగోలుదారులు అంతగా రాకపోవడంతో వ్యాపారులు నిరుత్సాహంతో ఇంటి దారి పట్టారు. సాయంత్రం వేళ చిరుతిళ్లు విక్రయించి పొట్ట నింపుకునే వారిదీ ఇదే దుస్థితి. పానీపూరీ, చాట్ బళ్లు, పల్లీ బళ్ల వ్యాపారులు వర్షానికి వ్యాపారం సాగక విలవిల్లాడారు. వ్యాపారం జరగకపోవడంతో పస్తులుండే పరిస్థితి ఎదురవుతోందని పలువురు బడుగుజీవులు ఆవేదన వ్యక్తం చేశారు.



కంచరపాలెం రైతుబజారు బయట మార్కెట్‌లో వర్షంలో చిరువ్యాపారి

బస్ బేపై కూలిన చెట్టు కొమ్మలు

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డులోని రేసపువానిపాలెం సీఎంఆర్ సెంట్రల్ సమీపంలోని బస్ బేపై చెట్టు కొమ్మ కూలిపోయింది. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షంతోపాటు శనివారం ఉదయం నుంచి ఈదురు గాలులు వీయడంతో సాయంత్రం చెట్టు కొమ్మ విరిగిపోయింది. అదృష్టవశాత్తూ ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం జరగలేదు.

రోడ్లు జలమయం..చిరు వ్యాపారాలు వెలవెల

సీతమ్మధార: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు ప్రాంతాల్లో రోడ్ల మీదనే వర్షపు నీరు నిలిచిపోయింది. జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలో చిరు వ్యాపారులు వర్షం కారణంగా నూడిల్స్ బళ్లు తెరవ లేదు. సీతమ్మధార రైతుబజారులో కొనగోలుదారుల కోసం రైతులు ఎదురు చూసే పరిస్థితి నెలకొంది. నక్కవానిపాలెం క్రాంతి నగర్, గాంధీనగర్, రేసపువానిపాలెం, సత్యం జంక్షన్, టీపీటీ కాలనీ ప్రాంతాల్లో రోడ్లు జలమయమయ్యాయి. 14వ వార్డులోని బాలయ్య శాస్త్రి లే అవుట్, నార్త్ ఎక్స్‌టెన్సన్, గణేష్‌నగర్, సీతమ్మధార, ఏఎస్‌ఆర్ నగర్, బిలాల్ కాలనీ, పీ అండ్ టీ కాలనీ, టీపీటీ కాలనీ, రాధాకృష్ణ లేవుట్ తదితర ప్రాంతాల్లో రోడ్లన్నీ జలమయమయ్యాయి. పలు నివాసాల ముందు కాలువల మీద గట్లు కారణంగా వర్షపు నీరు ఎక్కడికక్కడే నిలిచిపోయింది. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ వైర్ల మీద చెట్ల కొమ్మలు పడి విద్యుత్ సరఫరాకి అంతరాయం కలిగింది. దీంతో ఏపీ ఈపీడీసీఎల్ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. కొన్ని ప్రాంతాల్లో రోడ్ల మీద వున్న గోతుల్లో వర్షం నీరు నిలిచిపోవడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. కాలువల్లోని మురుగునీరు రోడ్లపైకి వచ్చేసింది. తెరిపివ్వని వర్షాలతో వ్యాపారాలు సాగక, ఉపాధి లేక చిరు వ్యాపారులు అవస్థలు పడ్డారు. ఫుట్‌పాత్‌లు, రోడ్ల మీద వ్యాపారాలు చేసుకునేవారు దుకాణాలు ఏర్పాటు చేయలేని పరిస్థితి నెలకొంది.

సీతంపేట: వాయుగుండం ప్రభావంతో మూడు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షానికి నగరం తడిసి ముద్దయింది. గురువారం మొదలైన వర్షం శనివారం కూడా ఎడతెరిపిలేకుండా కురిసింది. జోరు వాన కారణంగా జనజీవనం చాలా వరకు ఇంటికే పరిమితమైంది. కాలు బయటపెట్టే వీలు లేకుండా రోజంతా వాన కురవడంతో జనం అవస్థల పాలయ్యారు. మూడు రోజులుగా వ్యాపారాలు సాగక చిరు వ్యాపారులు, తోపుడుబళ్ల వ్యాపారులు ఉసూరుమన్నారు. ముసురుతో బేరాలు లేక రోజు కూలీ కూడా కిట్టలేదని, పైగా తెచ్చిన సరకు పాడైపోతోందని తోపుడు బళ్ల వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. కొనేవారు లేక నరసింహనగర్ రైతుబజారు వెలవెల పోయింది.



కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న సీతమ్మధార రైతుబజారు



ఐటీఐ జంక్షన్ వద్ద కొనుగోలుదారుల కోసం ఎదురుచూస్తున్న చిరువ్యాపారి



సీఎంఆర్ మాల్ సమీపంలోని బస్ బేపై కూలిన చెట్టు కొమ్మలు



అక్కయ్యపాలెంలో రోడ్డుపై నిలిచిపోయిన వర్షపు నీరు



అక్కయ్యపాలెంలో మూసేసిన చిరు వ్యాపారుల బళ్లు



కొనుగోలుదారులు లేక బోసిపోయిన నరసింహనగర్ రైతు బజార్



వర్షాలకు వ్యాపారం లేక సీతమ్మధారలో తాళాలు వేసిన తోపుడు బళ్లు

వాతావరణ మార్పులపై పెయింటింగ్ పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో కళాశాల సిబ్బంది

సీతంపేట : స్థానిక బుల్లయ్య కళాశాలలో వాతావరణ మార్పు అనే అంశంపై స్టూడెంట్ సొసైటీ ఫర్ క్లైమేట్ చేంజ్ ఎన్జీవో సంస్థ, సీడ్స్ ఆఫ్ పీస్ అనే యూఎస్ సంస్థతో కలిసి రెండు రోజులపాటు ఆర్ట్ ఎగ్జిబిషన్, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. కళాశాలకు చెందిన 70 మంది గ్రీన్ క్లబ్ విద్యార్థులు మూడు బృందాలుగా ఉత్సాహంగా పాల్గొన్నారు. క్లైమేట్ చేంజ్‌పై విద్యార్థులు గీసిన పెయింటింగ్‌లు, ఆర్ట్ ఎగ్జిబిషన్ ఆలోచింపజేశాయి. పోటీలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ బహుమతులు అందజేశారు. పోటీలో పాల్గొన్న ఒక్కో బృందానికి 200 డాలర్లు చొప్పున పారితోషకం అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి, సురేఖ, బి.మాధవి, బి.శైలజ, పి.కిరణ్ కుమారి పాల్గొన్నారు.

'నిరర్థక ఆస్తుల ఫెయిర్' ప్రారంభం

సీతంపేట: ఇండియన్ బ్యాంక్, విశాఖపట్నం జోనల్ కార్యాలయం ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో సర్ఫేసి చట్టం పరిధిలో ఆస్తుల ఫెయిర్ -2024 నిర్వహించారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ ఫెయిర్‌ను శనివారం బ్యాంక్ జోనల్ మేనేజర్ అవధేష్ కుమార్ పుర్బే జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం, రాజమహేంద్రవరం జోన్‌లకు సంబంధించిన నిరర్థక ఆస్తుల వివరాలను ఫెయిర్‌లో ప్రదర్శించినట్లు చెప్పారు. ఇందులో ఫ్లాట్లు, స్థలాలు, గృహాలు, పారిశ్రామిక, వాణిజ్య ఆస్తులు ఉన్నట్లు వివరించారు. ఆసక్తి గల వారు వీటి వివరాల కోసం సమీప ఇండియన్ బ్యాంక్ శాఖను సంప్రదించాలని కోరారు. బ్యాంకు రికవరీ చీఫ్ మేనేజర్ అజీముద్దీన్ అహ్మద్ ఇర్ఫాన్ మాట్లాడుతూ ఈ ఆస్తులన్నీ సెప్టెంబర్, అక్టోబర్‌లో విక్రయించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఫెయిర్ ఆదివారం కూడా కొనసాగుతుందని, ఆసక్తి ఉన్న వారు ఈ ఆస్తుల వివరాలు తెలుసుకోవచ్చన్నారు. ఫెయిర్‌లో ఇండియన్ బ్యాంకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలోని నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి కౌశల్ వికాస్ భాగంగా పలు ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు తెలిపారు. డ్రోన్స్ తయారీ, అసెంబ్లింగ్ టెక్నిషియన్ కోర్సుతో పాటు ఎలక్ట్రిషియన్ కోర్సుల్లో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తారన్నారు. పదో తరగతి పాసైన వారు కాలేజీలోని స్కిల్ హబ్‌లో సంప్రదించాలన్నారు. వివరాలకు 7287069457 ఫోన్ నంబరులో సంప్రదించవచ్చన్నారు.

మిజోరం గవర్నర్‌కు సత్కారం



హరిబాబుని సత్కరిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార: మిజోరం గవర్నర్ కె.హరిబాబుని ఎమ్మెల్యే పెనుమత్స విష్ణుకుమార్‌రాజు శనివారం ఘనంగా సత్కరించారు. దసపల్లా హిల్స్‌లోని నివాసంలో హరిబాబును ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు విశాఖ ఉత్తర నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ ఎం.సురేష్ బాబు ఉన్నారు.

పేదల ఆకలి తీర్చడమే లక్ష్యం



పేదలకు అన్నం వడ్డిస్తున్న గొల్లమూల అప్పారావు

కంచరపాలెం: పేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా రాంజీ అభ్యుదయ సంఘం పనిచేస్తుందని దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, రాంజీ అభ్యుదయ సేవా సంఘ గౌరవ అధ్యక్షుడు గొల్లమూల అప్పారావు అన్నారు. కంచరపాలెంలోని రాంజీ అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతి శనివారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని అప్పారావు ప్రారంభించారు. సంఘం చేస్తున్న పలు సేవా కార్యక్రమాలకు తమ వంతు సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్.వెంకటరావు, బి.బైరవమూర్తి, బి.అప్పారావు, ఏపిస్ మణి, గణేష్, దేవుళ్లు, టి.కొండయ్య, సంఘం సభ్యులు పాల్గొన్నారు.


మొక్కలు నాటడం అందరి బాధ్యత



మొక్క నాటుతున్న రమణకుమారి, సిబ్బంది

మర్రిపాలెం : వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్) కార్యాలయంలో శనివారం మొక్కలు నాటారు. కార్యాలయం ఆవరణలో సీడీపీవో రమణకుమారి సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఆమె అన్నారు. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో మొక్కలు నాటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



కళ్యాణ్ (ఫైల్)

సీతమ్మధార : విద్యుత్ షాక్‌తో ఒక వ్యక్తి మృతి చెందాడు. ఎస్.కోటకు చెందిన కళ్యాణ్ (59) ఉపాధి కోసం విశాఖ వచ్చి డైమండ్ పార్క్ ప్రాంతంలోని ఒక అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మ్యాన్‌గా పనిచేస్తున్నాడు. డైమండ్ పార్కు సమీపంలో శనివారం సాయంత్రం రోడ్డు దాటుతున్న సమయంలో అక్కడ వైర్ పడి ఉండడాన్ని గమనించి... దాన్ని పక్కకు పెట్టడానికి పట్టుకోగా విద్యుత్ సరఫరా ఉండడంతో షాక్ తగిలింది. వెంటనే అతడిని కేజీహెచ్‌కు తరలించినప్పటికీ.. అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. అతనికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు ద్వారకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ కోతలతో గర్భిణుల అవస్థలు

శివనగర్ యూపీహెచ్‌సీకి వస్తే ఇబ్బందులు

మర్రిపాలెం : జీవీఎంసీ 53వ వార్డు మర్రిపాలెం సమీప శివనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఇటీవల నిత్యం విద్యుత్ కోతలతో గర్భిణులు, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఆరోగ్య కేంద్రానికి నెలవారీ తనిఖీల కోసం గర్భిణులు ఎక్కువగా వస్తుంటారు. వారిలో రక్తహీనతతో బాధపడే మహిళలకు ఐవీ ఇంజెక్షన్ ద్వారా ఐరన్ సుక్రోస్ ఎక్కిస్తారు. ఇందుకోసం వార్డులో కొంత సమయం నిరీక్షించాలి. ఆ సమయంలో విద్యుత్ కోతలు ఎక్కువగా ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గర్భిణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి ఆరోగ్య కేంద్రంలో రక్తహీనత చికిత్స కోసం పలుమార్లు వచ్చామని... ఎప్పటికప్పుడే విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఇబ్బందులు పడ్డామని గర్భిణులు, వారి బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ సమస్యపై అధికారులు దృష్టి సారించాలని, ఆస్పత్రులకు నిత్యం విద్యుత్ సరఫరా చేయాలని పలువురు కోరుతున్నారు.

జ్వరాలతో రోగుల క్యూ

శివనగర్ యూపీహెచ్‌సీకి జ్వర బాధితులు ఎక్కువగానే వస్తున్నారు. రోజూ కనీసం 50 మందికిపైగా ఆస్పత్రికి సాధారణ వైద్యం కోసం వస్తుండగా... వారిలో కనీసం ఐదుగురు జ్వర పీడితులే ఉంటున్నారు. మరోవైపు ఆగస్టు నెలలో ఐదు డెంగీ కేసులు నమోదు కావడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, దోమలు వృద్ధి చెందకుండా పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని వైద్య సిబ్బంది సూచిస్తున్నారు.



శివనగర్ ఆరోగ్య కేంద్రంలో గర్భిణి చికిత్స పొందుతున్న వార్డులో కరెంట్ లేక తిరగని ఫ్యాన్లు, వెలగని లైట్లు

కేంద్రం తీరుతో ఆటోవాలాలపై ఆర్థిక భారం

ప్రైవేటు సంస్థలకు అనుమతులు రద్దు చేయాలి



రైల్వే స్టేషన్ వద్ద ధర్నాలో ఏఐటీయూసీ నాయకులు

తాటిచెట్లపాలెం : ఆటో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకిచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ఆర్ అండ్ బీ రోడ్డులో టోల్‌గేట్ పెట్టే ప్రతిపాదన విరమించుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. విశాఖపట్నం రైల్వే స్టేషన్ వద్ద విజయదుర్గా ఆటో ఓనర్ కం డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఆటోల ఎఫ్‌సీలను ప్రైవేటు సంస్థల ద్వారా జారీ చేయాలని చూడడం దారుణమన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆటోలు, ఇతర మోటార్ వాహనాలపై ఆర్థిక భారం మోపిందన్నారు. డీజిల్, పెట్రోల్, ఇంజిన్ ఆయిల్, టోల్ గేట్ ఫీజులు, నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెంచి డ్రైవర్లకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోందని ఆరోపించారు.

ఇప్పటికే కేంద్రం భారీగా పెంచిన డీజిల్, థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, గ్రీన్ టాక్స్, టోల్‌గేట్ ఫీజులు, వాహన విడిభాగాల చార్జీలు, లేబర్ టాక్స్ కట్టలేక డ్రైవర్లు రోడ్డున పడుతున్నారన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన ప్రభుత్వం ఆర్ అండ్ బీ రోడ్లలో టోల్‌గేట్స్ పెట్టి ప్రతీ వాహనం నుంచి ఫీజులు వసూలు చేసేందుకు సిద్ధమవుతోందని, ఇటువంటి నిర్ణయాల వల్ల ప్రజలపై ఆర్థిక భారం పడుతోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ అమలైతే ఆటో డ్రైవర్లు మరింత ఇబ్బందులు పడి జీవనాధారం లేక రోడ్డున పడే పరిస్థితి వస్తుందన్నారు. ఈ సమస్యలపై మరింత విస్తృతంగా సెప్టెంబరు 1న రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, నిరసన కార్యక్రమాల్లో పాల్గొని ప్రభుత్వం కళ్లు తెరిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్.చెన్నారెడ్డి, హెచ్.శేఖర్, గౌరీ శంకర్, పి.అప్పన్న, శంకర్రావు, ఎం.శ్రీను, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ సమీపంలో నీటి కాలుష్యంపై విచారణ



బంకు నిర్వాహకులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రమేష్, ఇతర అధికారులు

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు పరిధి అక్కయ్యపాలెం సంఘం ఆఫీస్ కూడలిలో ఉన్న బీపీసీఎల్ పెట్రోల్ బంకు చుట్టు పక్కల ఉన్న అపార్టుమెంట్లలో బోరు నీరు పెట్రోల్, డీజిల్ వాసన వస్తోందని సుగుణాభిరామ అపార్టుమెంట్ వాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీతమ్మధార తహసీల్దార్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో వివిధ విభాగాల అధికారులు కలిసి సర్వే చేపట్టారు. సివిల్ సప్లై, బీపీసీఎల్ ఆయిల్ కంపెనీ, గ్రౌండ్ వాటర్ విభాగం, పొల్యూషన్ బోర్డు, జీవీఎంసీ వాటర్ సప్లై, జీవీఎంసీ హెల్త్ (శానిటేషన్), ఏయూ జియాలజీ విభాగం అధికారులతో కలిసి తహసీల్దార్ రమేష్ శనివారం పెట్రోల్ బంకును పరిశీలించారు. అలాగే పెట్రోల్ బంకు చుట్టూ ఉన్న బాధిత అపార్టుమెంట్ వాసులను కలిసి వారి ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. గత 8 నెలలుగా పెట్రోల్, డీజిల్ వాసనతో ఇళ్లల్లో నీరు వాడడానికి పనికిరాకుండా పోతోందని, డబ్బులు వెచ్చించి ట్యాంకర్లతో నీళ్లు తెప్పించుకుంటున్నట్టు అపార్టుమెంట్ వాసులు అధికారులకు తెలిపారు. గత 35 ఏళ్లుగా ఇక్కడ నివసిస్తున్నామని, ఎప్పుడూ ఇటువంటి సమస్య రాలేదని, పెట్రోల్ బంకు పెట్టిన తర్వాత సమస్య వచ్చిందని తెలిపారు. నీటి శాంపిల్స్ పరీక్షకు పంపగా పెట్రోల్, డీజిల్ కలిసినట్టు రిపోర్టు ఇచ్చారన్నారు. తమ ఇళ్లల్లో నీరు ఎందుకు కలుషితం అవుతుందో నిర్ధారించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అపార్టుమెంట్ నివాసితులు పడుతున్న ఇబ్బందులపై అధికారులు రాతపూర్వకంగా వినతులు తీసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రమేష్ మాట్లాడుతూ పెట్రోల్ బంకు పరిసరాల్లో 200 మీటర్ల వరకు నీరు కలుషితమై పెట్రోల్, డీజిల్ వాసన వస్తున్నట్టు గుర్తించామన్నారు. దీనిపై జియాలాజికల్ సర్వే చేయాల్సి ఉందని, తమ బృందం చేపట్టిన విచారణ నివేదిక కలెక్టర్‌కు సమర్పిస్తామని ఆయన తెలిపారు.

వైభవంగా సుప్రభాత సేవ



ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధి గొల్ల నిర్వహించి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి అభిషేకాలు చేశారు. సామూహిక విష్ణు సహస్రనామార్చన, రాజభోగ నివేదన చేశారు. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా 300 మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పింఛన్ల పంపిణీలో కలెక్టర్



పింఛను నగదు అందజేస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, తదితరులు

తాటిచెట్లపాలెం : జీవీఎంసీ 45వ వార్డు పరిధి తాటిచెట్లపాలెంలో శనివారం పింఛన్ల పంపిణీలో కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పాల్గొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శోభారాణి, యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ ఫణిరాం, కార్పొరేటర్ కంపా హనోకు, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

కేకే లైన్‌లో మాక్‌డ్రిల్



శిక్షణ పొందుతున్న వాల్తేర్ డివిజన్ సిబ్బంది

తాటిచెట్లపాలెం : వర్షాకాలంలో కేకే లైన్‌లో ఎదురయ్యే ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనేందుకు వాల్తేర్ డివిజన్ సన్నద్ధంగా ఉన్నట్లు సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. కొత్తవలస - కిరండూల్ లైన్‌లో కొండ, గుహల ప్రాంతాల్లో కొండ చరియలు విరిగిపడి రైళ్ల రాకపోకలకు అంతరాయం కలుగుతున్నందున ఆ పరిస్థితులను అధిగమించేందుకు 20 మంది సిబ్బంది అరుణాచల్ ప్రదేశ్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటైరింగ్ సంస్థలో శిక్షణ పొందారు. వీరంతా కేకే లైన్‌లో శుక్రవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. పెట్రోలింగ్ సిబ్బందికి సూచనలిచ్చేందుకు రిట్రో రిఫ్లెక్టివ్ ఇండికేటర్ బోర్డ్స్ ఏర్పాటు చేసినట్టు డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ తెలిపారు.

విదేశాల్లో వైద్య విద్యకు అవకాశం



సదస్సుకు హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు

సీతంపేట : వైద్య విద్యను అభ్యసించడానికి విదేశాల్లో చాలా అవకాశాలున్నాయని డాక్టర్ కె.భాస్కర్‌రామ్ అన్నారు. విదేశాల్లో వైద్య విద్య - అవకాశాలు అనే అంశంపై ఐఎస్‌ఎం ఫోకల్ పాయింట్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏయే దేశాల్లో వైద్య విద్య లభిస్తోంది, ఎవరిని సంప్రదించాలి, ఎంత ఖర్చు అవుతుందో వివరించారు. ఏఎస్‌ఎం డైరెక్టర్ సునీత లావణ్య మాట్లాడుతూ వైద్య విద్యను అతి తక్కువ ఖర్చుతో మధ్య తరగతి విద్యార్థులకు కూడా అందించాలన్న ఉద్దేశంతో అవగాహన సదస్సు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పలు రైళ్లు రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పూండి-నౌపడ, తిలారు-కొటబొమ్మాళి సెక్షన్ పరిధిలో ఆధునీకరణ పనుల నిమిత్తం పలు రైళ్లు ఆయా తేదీల్లో రీ షెడ్యూల్ చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ● పుదుచ్చేరిలో ఈ నెల 4న సాయంత్రం 6.50 గంటలకు బయల్దేరాల్సిన పుదుచ్చేరి - భువనేశ్వర్ (12897) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సుమారు 3 గంటలు ఆలస్యంగా రాత్రి 9.35 గంటలకు బయల్దేరుతుంది. ● కేఎస్‌ఆర్ బెంగళూరులో ఈ నెల 4, 6న మధ్యాహ్నం 1.30 గంటలకు బయల్దేరాల్సిన కేఎస్‌ఆర్ బెంగళూరు - భువనేశ్వర్ (18464) ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రెండున్నర గంటలు ఆలస్యంగా సాయంత్రం 4.10 గంటలకు బయల్దేరుతుంది. ● ఈ నెల 5 నుంచి 7 వరకు విశాఖపట్నం - పలాస - విశాఖపట్నం (07470 / 07471) మెము శ్రీకాకుళం రోడ్ వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తుంది. ఆయా తేదీల్లో ఈ రైలు శ్రీకాకుళం రోడ్ - పలాస మధ్య రాకపోకలు సాగించదు.

నేటి నుంచి ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలు

ఉక్కునగరం: ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలు ఆదివారం ఉక్కునగరం గురజాడ కళాక్షేత్రంలో ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు జరగనున్న సమావేశాలకు ఏఐటీయూసీ జాతీయ అధ్యక్షుడు రామేంద్ర కుమార్, ప్రధాన కార్యదర్శి అమరజీత్ కౌర్‌హాజరవుతున్నారు.